RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 13 సంచిక : 87 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | బుధవారం, 2 అక్టోబర్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-



# రేవంత్ పంతమా...! సీనియర్ల పట్టా...!!

## కేబినెట్ విస్తరణలో ఎవరిది పైచేయి అవుతుంది?

హైదరాబాద్ : అదిగో కేబినెట్ విస్తరణ.. ఇదిగో కేబినెట్ విస్తరణ.. అంటూ అధిష్టానం సంకేతాలు ఇస్తున్నా ఎప్పటికప్పుడు వాయిదా పడుతోంది. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే అని ఓసారి, రేవంత్ విదేశీ పర్యటన ముగిసిన వెంటనే అని మరోసారి.. ఇలా హైకమాండ్ లీకులు ఇస్తూ వాయిదా వేస్తూ పోతోంది. తను కోరిన నేతలకు కేబినెట్ లో అవకాశం కల్పించాలని రేవంత్ పట్టుబడుతుంటే.. సీనియర్లు ఇతరుల పేర్లను సిఫార్స్ చేస్తుండటంతో మంత్రివర్గ విస్తరణ అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారింది. ప్రస్తుత కేబినెట్ లో అతి కొద్ది మంది మాత్రం రేవంత్ కు తోడుగా నిలబడుతున్నారు.

సీఎంపై ప్రతిపక్షాలు విమర్శలు, ఆరోపణలు చేస్తుంటే ఒకరిద్దరు మినహా మంత్రులు ఎవరూ పెద్దగా ఈ విమర్శలను తిప్పికొట్టేందుకు ముందుకు రావడం లేదు. రైతు రుణమాఫీ , హైడ్రా.. ఇలా విషయం ఏదైనా బీఆర్ఎస్ , బీజేపీ నేతలు నేరుగా రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తున్నారు. అయినా మంత్రివర్గం నుంచి ఆశించిన స్థాయిలో రేవంత్ కు మద్దతు లభించడం లేదని కాంగ్రెస్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. దీంతో కేబినెట్ విస్తరణలో తనకు అనుకూలురుగా ఉండే నేతలకు చోటు కల్పించాలని అధిష్టానాన్ని రేవంత్ పట్టుబడుతున్నారు. అదే సమయంలో సీనియర్లు అడ్డుపుల్లలు వేస్తున్నారు. ఇటీవల జమ్మూ - కశ్మీర్ ఎన్నికలపై అధిష్టానం దృష్టి పెట్టడంతో కేబినెట్ విస్తరణపై ఫోకస్ చేయలేకపోయింది. ఇక, ఎన్నికలు ముగుస్తుండటంతో ఈ విషయంలో నాన్చివేతకు ఫుల్ స్టాప్ పెట్టాలని హైకమాండ్ నిర్ణయానికి వచ్చేసింది. దీంతో మంత్రివర్గ విస్తరణలో రేవంత్ అనుకూల నేతలకు అధిష్టానం చోటు కల్పిస్తుందా? లేదంటే సీనియర్లు చెప్పిన నేతలకు అవకాశం ఇస్తుందా? మధ్యేమార్గంగా రేవంత్, సీనియర్లు సూచించిన నేతలకు ప్రాధాన్యత ఇస్తుందా? అన్నది మరికొద్ది రోజుల్లోనే తేలనుంది.

# కేసీఆర్‌కు ఊహించని షాక్.. విలీనం దిశగా బీఆర్ఎస్!



తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కు ఊహించని షాక్ తగిలింది. కొద్ది రోజుల్లో మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మహారాష్ట్ర రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న కీలక పరిణామాలు కెసిఆర్ కు షాక్ ఇచ్చాయి. గతంలో టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్ పార్టీగా మార్చి జాతీయ రాజకీయాలు చేయడానికి రంగంలోకి దిగిన కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం తర్వాత మహారాష్ట్ర పైనే పెద్ద ఎత్తున ఫోకస్ చేసి మహారాష్ట్రలో పార్టీని ఏర్పాటు చేశారు.

**అగమ్యగోచరంగా బీఆర్ఎస్ పరిస్థితి :** అనేకమార్లు మహారాష్ట్రలో బహిరంగ సభలను సైతం నిర్వహించి అక్కడి నేతలను ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. అయితే గత ఎన్నికల ఓటమి తర్వాత కేసీఆర్ జాతీయ రాజకీయాలపై నోరెత్తలేదు. ఇప్పటివరకు జాతీయ రాజకీయాల పైన దృష్టి సారించలేదు. రాష్ట్రంలోనే బిఆర్ఎస్ పార్టీ పరిస్థితి నేతల పార్టీ రాయింపులతో అగమ్యగోచరంగా తయారైంది.

**శరద్ పవార్ ను కలవనున్న బీఆర్ఎస్ మహా నాయకులు :** ఈ క్రమంలో తాజాగా మహారాష్ట్రలోని బిఆర్ఎస్ పార్టీలోని నాయకులు శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో చేరి బిఆర్ఎస్ పార్టీని విలీనం చేయనున్నారు అన్న వార్తలు పెద్ద ఎత్తున హల్చల్ చేస్తున్నాయి. తాజాగా మహారాష్ట్ర రాష్ట్ర బీఆర్ఎస్ అధ్యక్షుడు మాణిక్ రావుతో సహా పార్టీ ముఖ్య నేతలు ఎన్సీపీ నేత శరత్ పవార్ ను కలవనున్నట్లు సమాచారం.

**అక్టోబర్ 6న ఎన్సీపీలో చేరిక...** ఈరోజు మహారాష్ట్ర బి ఆర్ ఎస్ నేతలు ఆయనతో కీలక భేటీ నిర్వహించిన తర్వాత అక్టోబర్ 6వ తేదీన పూణేలో ఎన్సిపి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో డిఆర్ఎస్ పార్టీ నేతలంతా మూకుమ్మడిగా నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారని అక్కడ బిఆర్ఎస్ పార్టీని విలీనం చేయబోతున్నారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఇక ఈ పరిణామం బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ కు ఊహించని పరిణామం.

**బిఆర్ఎస్ పార్టీ ఓటమిపాలై గద్దె దిగిన పరిస్థితి :** తెలంగాణ రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు దేశ్ కి నేతగా చెప్పుకున్న బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ దేశ రాజకీయాల్లో చక్రం తిప్పాలని భావించారు. ప్రధానంగా బిజెపిని టార్గెట్ చేసి మోడీ సర్కార్ ని గద్దె దించాలని శతవిధాల ప్రయత్నం చేశారు అయితే తెలంగాణ రాష్ట్రంలోని బిఆర్ఎస్ పార్టీ ఓటమిపాలై గద్దె దిగిన పరిస్థితి వచ్చింది.

**బి ఆర్ ఎస్ వైపు చూసిన వారంతా ఇప్పుడు పక్క చూపులు :** ఘోర పరాజయం తర్వాత ఆ బాధ నుంచి పూర్తిగా కోలుకోకముందే కేసీఆర్ తనయ కవిత ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో అరెస్టై జైలు పాలు కావడం వంటి పరిణామాల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ మరింత కుదేలైంది. దీంతో కేసీఆర్ ప్రస్తుతం సైలెంట్ గా ఉన్నారు. కేసీఆర్ సైలెంట్ గా ఉండడంతో ఆయా రాష్ట్రాలలో బి ఆర్ ఎస్ వైపు చూసిన వారంతా ఇప్పుడు పక్క చూపులు చూస్తున్నారు.

**గులాబీ బాస్ ఏం చేస్తారో :** ఈ క్రమంలోనే మహారాష్ట్రలోని బిఆర్ఎస్ పార్టీ నేతలంతా శరత్ పవార్ ఎన్సీపీలో చేరి పార్టీని విలీనం చేయనున్నారు అన్నది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది .తెలంగాణ రాష్ట్రం తర్వాత కాస్త కూస్తో పట్టు సాధించిన మహారాష్ట్రలో పార్టీ నేతలు అంతా జంప్ అవుతున్న క్రమంలో బిఆర్ఎస్ పార్టీ పరిస్థితి పైన, జాతీయ రాజకీయాల పైన గులాబీ బాస్ ఏం చేయబోతున్నారు అన్నది ప్రస్తుతం ఆసక్తిగా మారింది.




హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఇవాళ(మంగళవారం) గచ్చిబౌలి ఏఐజీ హాస్పిటల్లో చేరారు. మంగళవారం ఉదయం వైద్య పరీక్షల కోసం కవిత ఆస్పత్రిలో చేరారు. ఈరోజు సాయంత్రానికి ఆమెకు వైద్య పరీక్షలు పూర్తికానున్నాయి. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో తీహార్ జైలులో ఉన్న సమయంలో గైనిక్ సమస్యలు, తీవ్ర జ్వరంతో పలు సార్లు తీవ్ర అనారోగ్యానికి కవిత గురైన విషయం తెలిసిందే.

**గతంలో రెండు సార్లు అస్వస్థత...** గతంలో తిహాడ్ జైల్లో ఉండగా కవిత రెండు సార్లు అస్వస్థతకు లోనయ్యారు. జూలై 16న తొలిసారిగా కవితను ఢిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. రెండు రోజుల తర్వాత జూలై 18న ఆమెను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరుపరచగా, తనకు ఎదురవుతున్న అనారోగ్య సమస్యలను జడ్జి కావేరి బవేజా దృష్టికి కవిత తీసుకెళ్లారు. ఆ తర్వాత ఆమె విజ్ఞప్తి మేరకు ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలకు అనుమతి ఇచ్చారు. అప్పటి నుంచి ఆమె ఆరోగ్య పరిస్థితి పూర్తిగా మెరుగుపడలేదు. జైలు వైద్యులే కవితకు వైద్యం అందించారు. ఆ తర్వాత ఆగస్టు-22న మరోసారి కవిత అస్వస్థతకు గురయ్యారు. ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించి, తిరిగి జైలుకు తీసుకెళ్లారు. కొంతకాలంగా కవిత గైనిక్ సమస్యలతో బాధపడుతూ ఉండటం.. దీనికి తోడు ఇటీవల వైరల్ జ్వరం బారినపడ్డారు. దీంతో.. కవిత భర్త అనిల్ సమక్షంలో వైద్య పరీక్షలు చేశారు.



# ఢిల్లీలో హైకమాండ్‌తో రేవంత్ భేటీ..

## హైడ్రా దూకుడు తగ్గనుందా?

హైదరాబాద్ : ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. దేశవ్యాప్తంగా హైడ్రా గురించే చర్చ జరుగుతోంది. తాజాగా హైడ్రా విషయంలో హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో కూడా అందరూ హైడ్రా గురించే మాట్లాడుకుంటున్నారు. హైదరాబాద్ లోనే కాదు.. ఢిల్లీలో కూడా ఇప్పుడు హైడ్రానే హాట్ టాపిక్ గా మారింది. ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యనటలో ఉన్నారు. సోమవారం రాత్రి ఆయన ఢిల్లీ వెళ్లారు. మంగళవారం ఉదయం సీఎం రేవంత్ హైకమాండ్ తో భేటీ అయ్యారు. ఈ సమయంలో %ూ×జజ% అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే- సీఎం రేవంత్ మధ్య హైడ్రాకి సంబంధించి కీలక చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పుడు అందరూ హైడ్రా దూకుడు తగ్గనుంది అని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ భేటీకి హైడ్రాకి ఉన్న లింక్ ఏంటి? నిజంగానే హైడ్రా దూకుడు తగ్గనుందా? పూర్తి వివరాలు తెలుసుకుందాం. ఢిల్లీలో %ూ×జజ% అధ్యక్షుడు మల్లికార్జడున ఖర్గేతో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. ఈ సమావేశం దాదాపుగా గంటసేపు జరిగింది. ఈ మీటింగ్ లో తెలంగాణకు సంబంధించిన పలు విషయాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రముఖంగా ఖర్గే హైడ్రా గురించి ఆరా తీసినట్లు చెబుతున్నారు. తాజాగా హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. హైడ్రా కమిషనర్ రంగనాథ్ పై హైకోర్టు ప్రశ్నల వర్షం కురిపించింది. అడిగిన ప్రశ్నలకు మాత్రమే సమాధానం చెప్పాలి అంటూ మందలించింది. అంతేకాకుండా.. అసలు హైడ్రాకి ఉన్న చట్టబద్ధత ఏంటని సూటిగా ప్రశ్నించింది. మీరు ఎందుకు సెలవు దినాల్లో కూల్చివేతలు చేస్తున్నారు? అని మండిపడింది. చట్టాలకు లోబడకుండా కూల్చివేతలు చేస్తున్నారని హైకోర్టు మండిపడింది. ప్రజలను భయపెట్టాలని చూస్తున్నారా? అసలు సమయం ఇవ్వకుండా కూల్చివేతలు ఏంటని ప్రశ్నించింది. ఈ నేపథ్యంలోనే హైకమాండ్ కూడా హైడ్రాకి సంబంధించి ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఈ భేటీలో సీఎం రేవంత్ హైడ్రా ఆవశ్యకతను ఖర్గేకి వివరించారు. చెరువులు, నాళాలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తోడ్పడుతుందని సీఎం వివరించినట్లు తెలుస్తోంది. మూసీ నది సుందరీకరణ ప్రాజెక్ట్ సర్వే గురించి ఖర్గే వద్ద ప్రస్తావించినట్లు తెలుస్తోంది. అయితే హైకమాండ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేసినట్లు చెబుతున్నారు. ముఖ్యంగా పేదలకు అన్యాయం జరగకుండా చూడాలని చెప్పారని తెలుస్తోంది. ప్రజావ్యతిరేకత రాకుండా చూసుకోవాలని సూచించినట్లు చెబుతున్నారు. అందుకోసం కాస్త దూకుడు తగ్గించాలని సీఎం రేవంత్ కి సూచించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే హైడ్రా దూకుడు తగ్గనుంది అనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కాస్త ప్రజా వ్యతిరేకత తగ్గే వరకు కూల్చివేతలకు బ్రేక్ వేస్తారని చెబుతున్నారు. హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు, హైకమాండ్ సూచలన నేపథ్యంలో ఇలాంటి అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే ఆక్రమణలో విషయంలో మాత్రం హైడ్రా దూకుడు తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. పేదల ఇళ్ల జోలికి హైడ్రా రాదు అని తాజాగా కూడా రంగనాథ్ స్పష్టం చేశారు. నగరంలో జరిగే ప్రతి కూల్చివేతకు హైడ్రాకి సంబంధం ఉండదు అని క్లారిటీ ఇచ్చారు. ఈ కామెంట్స్ ని బట్టి చూస్తే హైడ్రా దూకుడు తగ్గేలా కనిపించడం లేదు అంటున్నారు. మల్లికార్జున ఖర్గే- సీఎం రేవంత్ భేటీలో దసరాకు మంత్రివర్గ విస్తరణ గురించి కూడా చర్చ జరిగినట్లు చెబుతున్నారు. ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి కూడా చర్చించినట్లు తెలుస్తోంది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## తిరుమల లడ్డూ.... సిట్ దర్యాప్తులో తేలింది ఏంటి?

వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ తయారీలో జంతువుల నూనెలు, కొవ్వులు కలిశాయనే ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం లడ్డూ అంశంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించింది. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి నేతృత్వంలో సిట్ విచారణను వేగవంతం చేసింది. ఇప్పటికే ఈ బృందం తిరుమలకు చేరుకుంది. తిరుమలలోనే ఉండి లడ్డూ తయారీని పరిశీలించనుంది. అలాగే మాజీ టీటీడీ మాజీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, అప్పటి ఈవోలు, ఇప్పటి ఈవో శ్యామలరావు తదితరులను ప్రశ్నించనుంది సిట్ తన దర్యాప్తులో భాగంగా మొదటి రోజు శ్రీవారిని దర్శించుకుంది. ఇక రెండో రోజు సెప్టెంబర్ 29న సిట్ బృందం సమావేశమైంది. ఎవరెవరు ఏయే పనులు చేయాలో బాధ్యతలు నిర్దేశించుకున్నారు. మరోవైపు కల్తీ నెయ్యి సరఫరాకు సూత్రధారులు, పాత్రధారులపై క్రిమినల్ కేసుల నమోదుకు సిద్ధమవుతున్నారు. ఏఆర్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కల్తీ నెయ్యి సరఫరా చేసి, దేవస్థానాన్ని మోసం చేసిందంటూ టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ జీఎం మురళీకృష్ణ ఇటీవల తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఆ మేరకు ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో సిట్ దర్యాప్తుకు దిగింది. సిట్ అధిపతి సర్వశ్రేష్ఠ త్రిపాఠి, సభ్యులు.. విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ, కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజు టీటీడీ ఈవో శ్యామలరావును ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఏఆర్ డెయిరీకి టెండర్లు కట్టబెట్టిన వ్యవహారంపై ఆయన నుంచి వివరాలు సేకరించినట్టు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో జరిగిన టెండర్ లో ప్రాథమికంగా ఎన్ని సంస్థలు పాల్గొన్నాయి? వాటిలో గరిష్ఠ, కనిష్ఠ ధరలపై సరఫరా చేసేందుకు టెండరు వేసిందెవరు? కాంట్రాక్టర్ ఎంపిక ఎలా జరిగింది? నెయ్యి సరఫరా తీరు ఎలా ఉంది? వంటి అంశాలపై ఈవో నుంచి సమాధానాలు రాబట్టినట్టు తెలుస్తోంది. ఈవోను కలిసిన అనంతరం సిట్ అధికారులు ప్రొక్యూర్‌మెంట్ జీఎం మురళీకృష్ణను పిలిపించి వివరాలు సేకరించారని తెలుస్తోంది. ఎల్-1గా వచ్చిన సంస్థకు కాంట్రాక్టుని ఇచ్చే ముందు ఎల్-2 కూడా అదే ధరపై సరఫరాకు ముందుకొస్తే 65:35 ప్రాతిపదికన కట్టబెట్టే పద్ధతి ఉందా? అని ఆయనను ప్రశ్నించినట్టు సమాచారం. ఏఆర్ డెయిరీకి నెయ్యి సరఫరా కాంట్రాక్టును కట్టబెట్టడం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో సిట్ ఆరా తీస్తోంది. ఈ నేపథ్యంలో ఏఆర్ డెయిరీకి కూడా నోటీసులు ఇవ్వనుందని చెబుతున్నారు.

## విద్యార్థుల్లో వైకల్యం.. ఇదిగో సహాయం

గోదావరిఖని : విద్యార్థుల్లోని శారీరక, మానసిక వైకల్యాలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ప్రశస్త' పేరిట ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను రూపొందించాయి. మొత్తం 20 విభాగాల్లో పలు అంశాలకు సంబంధించిన వివరాలను నమోదు చేయడం ద్వారా.. ఆయా విద్యార్థుల్లోని వైకల్యాలను గుర్తించే వీలుంటుంది. 0-18 సంవత్సరాలలోపు వారి వైకల్యాలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే.. వారికి అవసరమైన చికిత్స, సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో 'ప్రశస్త'ను రూపొందించారు. ప్రస్తుతం పాఠశాల స్థాయిలో వివరాల నమోదు ప్రక్రియ కొనసాగుతుంది. అనంతరం అంగన్‌వాడీల స్థాయిలో నమోదు చేయించే అవకాశముంది. పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు నమోదు చేసే వివరాలను.. ద్వితీయ స్థాయిలో 'భవిత' కేంద్రాలకు సంబంధించిన ప్రత్యేక విద్యా బోధకులు వారికి అవసరమైన సహాయం అందించేలా చర్యలు తీసుకుంటారు.

నమోదు చేశాక..

'ప్రశస్త' యాప్ ద్వారా విద్యార్థుల వైకల్యాలను గుర్తించాక.. ఆయా పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తారు. ఆయా విద్యార్థుల వైకల్యాల వివరాలను వారితో చర్చించాల్సి ఉంటుంది. సంబంధిత వైకల్యం ఏ మేరకు ఉందనే విషయంలో వైద్య ధ్రువీకరణ పత్రం(సదరం) కోసం దరఖాస్తు చేయాలి. ఇందులో 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి చట్టపరంగా వివిధ రకాల సహాయం, రాయితీలు పొందేందుకు అర్హత పొందుతారు. పాఠశాల స్థాయిలోనే వారికి అవసరమైన ప్రత్యేక పరికరాలు, వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకుంటారు.

యుడైస్ కోడ్ ఆధారంగా..

జాతీయస్థాయిలో 'యుడైస్' కోడ్ కలిగిన ప్రతి పాఠశాలలోని పెన్(జాతీయ స్థాయిలో విద్యార్థి గుర్తింపు) నంబరు కలిగిన ప్రతి విద్యార్థి వివరాలను తప్పనిసరిగా 'ప్రశస్త' యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఉపాధ్యాయులు నమోదు చేసిన వివరాలను సరిచూసి ధ్రువీకరించాల్సి ఉంటుంది. వచ్చే నెలాఖరులోగా దేశవ్యాప్తంగా వివిధ పాఠశాలల్లోని విద్యార్థులందరి వివరాలను 'ప్రశస్త' యాప్‌లో నమోదు చేయడం పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు మండలాల వారిగా పాఠశాలల నిర్వాహకులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించేలా ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

సులువుగా గుర్తించేందుకు..

తల్లిదండ్రులకంటే తరగతి గదిలో ఉపాధ్యాయులు విద్యార్థుల వైకల్యాలను సులువుగా గుర్తించే అవకాశముంది. నల్లబల్లపై అక్షరాలు స్పష్టంగా కనిపించకపోవడం, మాట్లాడేటప్పుడు తడబడటం, వినికిడి సమస్యలాంటి వివిధ సమస్యలను ఉపాధ్యాయులు సులువుగా గుర్తిస్తారు. ఈ లక్షణాలను 'ప్రశస్త' యాప్‌లో నమోదు చేసినట్లయితే అలాంటి విద్యార్థులకు అవసరమైన చికిత్స, ప్రయోజనాలను ప్రభుత్వం సమకూర్చేందుకు వీలవుతుంది.

బయ్యపు సుదర్శన్‌రెడ్డి, జిల్లా యాప్ రిసోర్సు పర్సన్

## ప్రశస్తతో ప్రయోజనం



సిరిసిల్ల : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో చాలా మంది శారీరక, మానసిక, ఇతర సమస్యలతో బాధపడుతుంటారు కానీ.. ఎక్కువ మంది విద్యార్థుల వైకల్యాలు కనిపించేలా ఉండవు. ఇలాంటి వారిని గుర్తించడానికి నూతన విద్యావిధానానికి అనుకూలంగా ఎన్‌సీఈఆర్‌టీ ప్రశస్త (ప్రీ అసెస్‌మెంట్ హోలిస్టిక్ స్క్రీనింగ్ టూల్) అనే ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. దీనిపై ఇప్పటికే జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఈ నెల 27 నుంచి జిల్లాలోని పాఠశాలల్లో సర్వే ప్రారంభమైంది.

నమోదు ఇలా..

ప్రశస్త యాప్‌ను అందరు ఉపాధ్యాయులు తమ మొబైల్ ఫోన్‌లో ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.

యాప్‌లో ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాఠశాల మెయిల్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలి.

ఇతర ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత మెయిల్ ఐడీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

ఉపాధ్యాయులందరూ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న తర్వాత ప్రధానోపాధ్యాయులు రిజిస్ట్రేషన్‌ను ధ్రువీకరించాలి.

ఆ తర్వాత విద్యార్థులను పరిశీలించి సర్వేను ఆన్‌లైన్ విధానంలో పూర్తి చేస్తారు.

సర్వే పూర్తయిన తర్వాత విద్యార్థుల వివరాలను గోప్యంగా ఉంచుతారు.

మొదట ఉపాధ్యాయులు సర్వేను పూర్తి చేసిన తర్వాత స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ (ఐఈఆర్‌పీ) మరోసారి సర్వేను చేస్తారు.

సర్వేలో పరిశీలించే అంశాలు

విద్యార్థి ఎలా మాట్లాడుతున్నాడు?

సరిగా చదవగలుగుతున్నాడా?

ఎలా రాస్తున్నాడు?

హోం వర్క్ సరిగా చేస్తున్నాడా?

తరగతి గదిలో విద్యార్థి ప్రవర్తన.

ఉపాధ్యాయుడి సూచనలు పాటిస్తున్నాడా?

కాళ్లు, చేతులు, తల, పొడవు, పొట్టి, చేతివేళ్లు, మొదలైన అవయవాలకు సంబంధించిన వివరాలు.

చూపు ఎలా ఉంది.. రంగులను గుర్తిస్తున్నాడా.. నల్లబల్ల సరిగా కనిపిస్తుందా.. గణిత చిహ్నాలను గుర్తిస్తున్నాడా? తదితర అంశాలకు సంబంధించిన ప్రశ్నలు సర్వేలో ఉంటాయి. విద్యార్థుల్లో ఉన్న వైకల్యాలను గుర్తించి దానికి తగిన దానికి తగిన చికిత్సను అందించనున్నారు.

జిల్లాలో ఇలా..

ప్రభుత్వ పాఠశాలలు : 511

ప్రైవేటు పాఠశాలలు : 121

విద్యార్థులు : సుమారు 83 వేల మంది

అక్టోబర్ నాటికి పూర్తి

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. విద్యాశాఖ సూచించిన ప్రశ్నల ఆధారంగా యాప్‌లో విద్యార్థుల వైకల్యాలను నమోదు చేయాలి. ఈ సర్వేను ఉపాధ్యాయులు అక్టోబరు నెలాఖరులోగా పూర్తి చేయాలి. ఆ తర్వాత ఐఈఆర్‌పీలు సర్వేను పూర్తి చేసి గుర్తించిన వైకల్యాల ఆధారంగా వారికి సమీపంలోని ఆసుపత్రుల్లో చికిత్స అందుతుంది.

సతీశ్‌కుమార్, జిల్లా కో-ఆర్డినేటర్

## పండగ వేళ కార్మికుల ఖాతాకు వేతనాలు

కరీంనగర్: పాలకవర్గం పదవీకాలం ఫిబ్రవరి 1న ముగిసింది. నాటి నుంచి నిధుల లేమితో పల్లెల్లో పాలన పడకేసింది. ఇప్పటికీ ఎనిమిది నెలలవుతున్నా ప్రత్యేక అధికారుల పాలనలో పల్లెలు తడబడుతున్నాయి. జీతాలు అందక కొంతకాలంగా ఇబ్బంది పడుతున్న కార్మికుల బాధలు దూరం చేస్తూ బతుకమ్మ, దసరా ఉత్సవాల వేళ నిధులు విడుదల చేసింది రాష్ట్ర ప్రభుత్వం. వేతనాలతోపాటు కరెంటు బిల్లులు, ట్రాక్టర్ బ్యాంకు వాయిదాల చెల్లింపునకు పచ్చజెండా ఊపింది. ఇప్పటికే జిల్లా పంచాయతీ కార్యాలయం ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. ఒకటి, రెండు రోజుల్లో గ్రామ పంచాయతీ ఖాతాలకు, కార్మికుల ఖాతాల్లో నిధులు జమకానున్నాయి.

కార్యదర్శులే ముందుండి..

సర్పంచుల పదవీకాలం పూర్తికావడం, సకాలంలో నిధులు విడుదల కాకపోవటం, ప్రత్యేక అధికారుల పాలనలో ఏ అభివృద్ధి జరగాలన్నా గ్రామాల్లో కార్యదర్శులే ముందుండి నడిపిస్తున్నారు. కార్యదర్శి తన చేతి నుంచి ముందే డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. ఇలా వారికి వచ్చే వేతనాల నుంచి రూ.వేలల్లో పంచాయతీ కోసం ఖర్చు చేశారు. ట్రాక్టర్ నిర్వహణ, డీజిల్ కొనుగోలు, గ్రామంలో విద్యుత్తు బిల్లులు, వీధి దీపాలు, బ్లీచింగ్ కొనుగోలుకు, నీటి ట్యాంకులకు సింగిల్‌ఫేజ్ అమర్చడం, అక్కడక్కడ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వడంవంటి కార్యక్రమాలకు కార్యదర్శులే సొంతంగా డబ్బులు చెల్లిస్తూ ముందుండి



నడిపిస్తున్నారు. వానాకాలంలో పల్లెల్లో దోమలు వృద్ధి చెందకుండా పరిశుభ్రత నిర్వహణ బాధ్యతలు చక్కదిద్దుతూ పల్లెపాలనను ఉన్నతాధికారుల ఆదేశాలతో నెట్టుకొస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం బతుకమ్మ, దసరా పండుగలకు ముందు పారిశుద్ధ్య సిబ్బంది జీతభత్యాలు, కరెంటు బిల్లులు, ట్రాక్టర్ బ్యాంకు వాయిదాలకు డబ్బులు విడుదల చేయటంతో కార్యదర్శులు ఊపిరి పీల్చుకోనున్నారు. పల్లెలకు నిధులు సర్కారు ప్రతి నెలా సక్రమంగా విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ముడుపులిస్తేనే..అనుమతులు

కామారెడ్డి : పట్టణీకరణలో భాగంగా జిల్లా కేంద్రంలో భవన నిర్మాణాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇందుకు అనుగుణంగా భవన నిర్మాణ అనుమతులు సులభతరం, పారదర్శకం చేసేందుకు రాష్ట్ర పురపాలక శాఖ టీఎస్-బీపాస్ అమల్లోకి తెచ్చింది. బిల్డింగ్ పర్మిషన్ల జారీలో ఇరిగేషన్, పీఆర్, ఆర్అండ్‌బీలతో కూడిన డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ (డీటీఎఫ్) కమిటీలను రంగంలోకి దించింది. అయినప్పటికీ జిల్లా కేంద్రంలో ఇటీవలి కాలంలో వసూళ్లు భారీగా పెరిగిన తీరుపై ప్రత్యేక కథనం. పట్టణ ప్రణాళిక విభాగంలోని కొంతమంది అవినీతి అధికారులు, దళారుల అవతారమెత్తిన కొందరు పట్టణ ప్రజాప్రతినిధులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. గతంలో పురపాలిక అనుమతులతో నిర్మాణం చేసుకున్న ఇంటిపై.. ప్రస్తుతం రెండు, మూడో అంతస్తుల నిర్మాణం చేసుకోవాలంటే అనుమతి ఇచ్చేందుకు నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇంటిని కూల్చేసి సెట్‌బ్యాక్ నిబంధనలు అమలు చేస్తేనే అనుమతిస్తామని తేల్చిచెబుతున్నారు. దీంతో నిర్మాణదారులు పట్టణ ప్రణాళిక విభాగానికి చెందిన యంత్రాంగంతోపాటు దళారులను కలిసి ఎంతో కొంత సమర్పించుకుంటేనే అనుమతులు లభించే పరిస్థితి.

నిబంధనల ప్రకారం

అనుమతికి దరఖాస్తు చేసుకోగానే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేసి నిబంధనలకు అనుగుణంగా మొదటి దశలో నిర్మాణ అనుమతి రుసుం ఖరారు చేసి కమిషనర్‌కు నివేదించాల్సి ఉంటుంది.

డీటీఎఫ్(డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్) కమిటీ నుంచి అభ్యంతరాలు లేకపోతే అనుమతి మంజూరు చేయాలి. ఇందుకు విరుద్ధంగా గతంలో నిర్మాణం చేసుకున్న సమయంలో సెట్‌బ్యాక్ లేదంటూ ప్రస్తుతం ఉన్న ఇంటిని



కూల్చివేస్తేనే గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి పైఅంతస్తుకు అనుమతి అంటూ కొర్రీలు పెడుతున్నారు.

రూ.లక్షల వ్యయం చేసి నిర్మాణం చేసిన ఇంటిని కూల్చేందుకు సిద్ధంగా లేని యజమానులు అనుమతి కోసం దళారుల అవతారమెత్తిన స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు పట్టణ ప్రణాళిక విభాగం యంత్రాంగానికి అనుసంధానంగా పనిచేసే ప్రైవేటు ఇంజినీర్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా అనుమతుల పేరుతో ధరలు నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నారు.

మచ్చుకు కొన్ని..

ఓ ఉద్యోగి రెండేళ్ల క్రితం అశోక్‌నగర్‌లోని తన ప్లాట్‌లో పురపాలిక అనుమతులతో ఇల్లు నిర్మించుకున్నారు. ఆర్థిక పరిస్థితి మెరుగవ్వడంతో జీ ప్లస్ వన్, జీ ప్లస్ టూ నిర్మాణాల నిమిత్తం అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సెట్‌బ్యాక్ లేదంటూ పైఅంతస్తుకు అనుమతి నిరాకరించారు. ఇంటిని కూల్చేస్తే జీ ప్లస్‌వన్, జీ ప్లస్ టూలకు అనుమతి ఇస్తామని వెల్లడించడంతో కంగుతిన్నారు. అనంతరం యజమాని దళారిని ఆశ్రయిస్తే నగదు తీసుకుని అనుమతి మంజూరు చేశారు. జిల్లా కేంద్రం శివారులోని దేవునిపల్లి పురపాలికలో విలీనం కాకముందు పంచాయతీ అనుమతులతో సెట్‌బ్యాక్ నిబంధనలకు అనుగుణంగా ఓ వ్యాపారి ఇంటి నిర్మాణం చేసుకున్నారు. ఇటీవల పైఅంతస్తు నిర్మాణం చేసుకునేందుకు అనుమతి కోసం టీఎస్-బీపాస్‌లో అర్జీ పెట్టుకున్నారు. పంచాయతీ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం చేసుకున్న ఇంటికి పైఅంతస్తుకు అనుమతి సాధ్యం కాదని తేల్చారు. దళారిని ఆశ్రయిస్తే నగదు తీసుకొని అనుమతులు మంజూరు చేశారు. ఇలా నగదు సమర్పిస్తేనే అడుగు ముందుకు పడే పరిస్థితి నెలకొంటోందని బాధితులు వాపోతున్నారు. 'నిబంధనలకు అనుగుణంగానే అనుమతులు మంజూరు చేస్తున్నాం. వసూళ్లు చేస్తున్నారనేది తప్పుడు ఆరోపణలు. సిబ్బంది ఎవరైనా వసూళ్లు చేసినట్లు నిర్మాణదారులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారులకు నివేదించి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని' పట్టణ ప్రణాళిక విభాగం అధికారి గిరిధర్‌తో పేర్కొన్నారు.

## ఐఏఎస్ యాప్ రూ.కోటితో జంప్

తలకొండపల్లి :చరవాణిలో వీడియోలు చూస్తూ డబ్బు సంపాదించవచ్చునంటూ ఓ యాప్‌లో వందల మంది చేరి రూ.కోటికి పైగా మోసపోయిన సంఘటన రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలో వెలుగులోకి వచ్చింది. మండలంలోని వెల్జాల్ గ్రామంలో ఐఏఎస్ (ఇరీడియన్ అడ్వర్టైజింగ్ సొల్యూషన్స్) యాప్ నుంచి సులువుగా డబ్బు సంపాదించవచ్చునని వందలాదిగా రూ.2200, రూ.5500, రూ.18,300



ఇలా మూడు విధాలుగా డబ్బులు చెల్లించారు. యాప్‌లో వచ్చే వీడియోలను లైక్ చేసి స్క్రీన్ షాట్ అప్‌లోడ్ చేస్తే వారి వాలెట్‌లో రూ.660 జమ చేశారు. కొందరికి మొదట్లో డబ్బు రావడంతో ఎక్కువ మంది ఆసక్తి కనబర్చారు. స్మార్ట్ ఫోను ఉన్న వారిలో ఎక్కువ మంది రూ.18,300 ఆన్‌లైన్‌లో చెల్లించి చేరారు. వీరికి ఒక్కరిని యాప్‌లో చేర్పిస్తే అంతే మొత్తం జమ కావడంతో పాటు చేర్చిన వారికి రూ.22 వేలను వాలెట్‌లో జమ చేశారు. ఈ ఆఫర్‌కు ఎక్కువగా ఆకర్షితులై ఒక ఇంట్లోనే భార్య, భర్త, పిల్లలతో పాటు బంధువులను ఐఏఎస్ యాప్‌లో చేర్చారు. తీరా 20 రోజుల నుంచి ఈ యాప్ పనిచేయడం లేదు. వెల్జాల్ గ్రామంలోనే 500మంది రూ.కోటికిపైగా నష్టపోగా.. అంతారం, మాదాయపల్లి, చౌదర్‌పల్లి, వెంకటాపూర్, చెన్నంపల్లి, పడకల్ గ్రామాల్లో మరో 200 మంది రూ.50 లక్షల వరకు మోసపోయారు. శంషాబాద్‌లో ఉన్న ఐఏఎస్ కార్యాలయానికి తాళం వేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

# అప్పు పుడితేనే అవసరం తీరేది!

పెద్దపల్లి : పారిశుద్ధ్య లోపంతో పరిసరాల దుర్గంధం, వెలగని వీధి దీపాలు, పాడయిన చేతిపంపులు, మరమ్మతుకు నోచుకోని బోరు మోటార్లు పల్లెల్లో వెక్కిరిస్తున్నాయి. పాలకవర్గాలు లేకపోవడంతో ఎనిమిది నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల విడుదల నిలిచిపోయింది. ఖాళీ ఖజనాతో పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాక్టర్ల కిస్తీలు, తాగునీటి పథకాల నిర్వహణ, సిబ్బందికి వేతనాల చెల్లింపు భారంగా మారింది. ప్రతి చిన్న పనికీ అప్పు చేయాల్సి వస్తోంది. చిన్న పంచాయతీలకు కిస్తీలు చెల్లించుకోలేని పరిస్థితి నెలకొంది.

రూ.43.20 కోట్లు పెండింగ్

కేంద్ర ప్రభుత్వ 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎస్ఎఫ్‌సీ(రాష్ట్ర ఆర్థిక సంఘం) నిధులను జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు విడుదల చేస్తాయి. ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం కావడంతో నిధుల విడుదల నిలిచిపోయింది. జిల్లాలోని 266 పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు ప్రతి నెలా రూ.5.40 కోట్ల చొప్పున ఎనిమిది నెలలకు రూ.43.20 కోట్లు రావాల్సి ఉంది. పంచాయతీ భవనాలు, సిమెంటు రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు దాదాపు రూ.156 కోట్లు, వేసవిలో తాగునీటి ఎద్దడి కోసం చేపట్టిన పనులకు రూ.1.83 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో 1100 మంది పారిశుద్ధ్య కార్మికులకు వేతనాల చెల్లింపు నిలిచిపోయింది.



అప్పులు తెస్తేనే అవసరాలు

తడి, పొడి చెత్త సేకరణ, మొక్కలను నీరందించేందుకు ట్రాక్టర్లకు ఇంధన ఖర్చు పంచాయతీలపై భారంగా మారింది.

సర్పంచులు లేకపోవడంతో కార్యదర్శులు వ్యక్తిగతంగా అప్పులు తెచ్చి పంచాయతీ అవసరాలకు వెచ్చించాల్సి వస్తోంది.

చేతిపంపులు, బోరుబావులు పాడయితే మరమ్మతు చేయలేని పరిస్థితి.

చాలా వీధులు దీపాలు లేక అంధకారంలో మగ్గుతున్నాయి.

అంతర్గత రహదారులు, మురుగు తొలగించడం లేదు. బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదు. కమాన్‌పూర్ పంచాయతీ పరిధి కిష్టంపల్లిలోని మురుగు కాలువ ఇది. పిచ్చిమొక్కలు కమ్ముకుపోయి, పూడిక తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమల బెడదతో స్థానికంగా వ్యాధులు ప్రబలుతున్నాయి. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి పంచాయతీ భవన నిర్మాణానికి సంబంధించి రూ.20 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా నిధుల మంజూరు కాలేదు. గుత్తేదారుకు రెండేళ్లుగా నిరీక్షణ తప్పడం లేదు. ప్రభుత్వానికి నివేదిస్తున్నాం

పంచాయతీల్లో నిధుల సమస్యపై ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. సిమెంటు రోడ్లు, భవనాల నిర్మాణానికి సంబంధించి ఉపాధిహామీ నిధులు మంజూరు కావాల్సి ఉంది. ఎక్కడా పారిశుద్ధ్య లోపం లేదు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. వీరబుచ్చయ్య, జిల్లా పంచాయతీ అధికారి

# హరితవనం.. ఆహ్లాదకరం!

కరీంనగర్ : పదేళ్ల కిందట కాంక్రీట్ జంగిల్‌గా మారిన కరీంనగర్.. ఇప్పుడు హరితవనంతో పచ్చదనం సంతరించుకుంటుంది. విడతల వారీగా నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదిగి నీడను, కాయను ఇచ్చే స్థాయికి వచ్చాయి. పెరిగిన చెట్లతో చిట్టడవులను తలపిస్తున్నాయి. తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా గత ప్రభుత్వం కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో తొమ్మిది విడతలుగా నాటిన మొక్కలతో ఆయా ప్రాంతాలలో పచ్చదనం ఉట్టి పడుతోంది. విలీన కాలనీలతోపాటు ప్రభుత్వ స్థలాల్లో మియావాకీ, బృహత్ వనాలు, పట్టణ ప్రకృతి వనాల పేరుతో వీటిని సంరక్షించారు. ఎక్కడ ఖాళీ స్థలం దొరికితే చాలు అక్కడ మొక్కలు నాటించారు. నగరవ్యాప్తంగా 55 ఎకరాల్లో నాటించగా ఆ మొక్కలు



అక్కడ చిట్టడవులే..

యాదాద్రి, మియావాకీ తరహాలో బుల్‌సెమన్ సెంటర్, శాతవాహన విశ్వవిద్యాలయం, సదాశివపల్లి, స్పోర్ట్స్ స్కూల్, డ్యాం కట్ట, మార్క్‌ఫెడ్, ఎస్ఆర్ఆర్ కళాశాల, రాశివనం, వెటర్నరీ కళాశాల, ఆర్టీసీ వర్క్‌షాప్ ఖాళీ స్థలాల్లో చిట్టడవులుగా వృక్షాలు పెరిగాయి. ఏపుగా పెరగడంతో ఆ ప్రాంతం హరితవనంగా మారింది. పాలకులు, అధికారులు నీటితోపాటు ఎరువులు, మట్టి తీసుకొచ్చి పోయించేలా చర్యలు తీసుకోవడంతో మొక్కలు వృక్షాలుగా ఎదిగాయి.

ఒకే చోట 25 ఎకరాల్లో...

పద్మనగర్ బుల్‌సెమన్ సెంటర్‌లో ఒకే చోట అయిదెకరాల నుంచి 25 ఎకరాలకు విస్తరించి లక్ష మొక్కలు వృక్షాలు అయ్యాయి. ఇప్పటికి సంరక్షణ చేసేందుకు, నర్సరీ పనులు చేసేందుకు హరితహారం కార్మికులు పని చేస్తున్నారు. ఈ వనంలోకి రాగానే అటవీ ప్రాంతంగా తలపిస్తోంది. ఇందులో అల్లనేరేడు, జామ, మునగ, నిమ్మ, జీడి చెట్లు, మామిడి, సీతాఫలం, పులిచింత, మారేడు, పనస, ఇరికి పండ్లు, దానిమ్మ, ఉసిరి, మల్లె, లిల్లీ, కనకంబరం, కలబంద, మలబార్, గొంగూర, బొప్పాయి తదితర మొక్కలు ఉన్నాయి.

ఇక్కడ పలు రకాల పక్షులు, ఎలుగుబంట్లు, నెమళ్లు, కుందేటళ్లు, కోతులు, జింకలు, కొండచిలువలు, పాములు వంటివి ఇందులో తిరుగుతున్నాయి. వీటికి చెట్లకు కాసే పండ్లు, కాయలు, ఆకులు తింటున్నట్లుగా తెలుస్తోంది. ఎప్పటికి తాగేందుకు నీటి సౌకర్యం ఉండటం, వాతావరణం చల్లగా ఉండటం పశు, పక్ష్యాదులు వస్తున్నట్లుగా చెబుతున్నారు.

ఔషధ మొక్కలు...

తులసి, నల్లేద, కలబంద, రణపాల, వాము వంటి చెట్లు బుల్‌సెమన్ సెంటర్‌తోపాటు ఫిల్టర్‌బెడ్ దగ్గర ఉన్న రాశివనంలో ఉన్నాయి.

నగరంలోని ఖాళీ స్థలాల్లో ఎనిమిది విడతలుగా నాటిన మొక్కలు పెరగడంతో ఆయా ప్రాంతాలు ఆకర్షణీయంగా మారాయి.

నాలుగైదు చోట్ల అయితే ఉద్యానవనాలు అన్నట్లుగా తలపిస్తున్నాయి. బుల్‌సెమన్ సెంటర్, రాశివనం, ఎస్ఆర్ఆర్ కళాశాల, శాతవాహన విశ్వవిద్యాలయం తదితర ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది.

# ఆరు కూడళ్లు.. రూ.826 కోట్లు




హైదరాబాద్ : కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ కష్టాలు త్వరలో పరిష్కారం కానున్నాయి. దాదాపు ఆరు కూడళ్లలో రూ.826 కోట్లతో జీహెచ్ఎంసీ భారీ ప్రాజెక్టును రూపొందించింది. పైవంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణంతో కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న దారులు రూపురేఖలను మార్చేందుకు సిద్ధమైంది. ఇటీవలే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, త్వరలో అనుమతి రానుందని కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు హెచ్-సిటీ ప్రాజెక్టు కింద, రెండు ప్యాకేజీలుగా పనులు చేపట్టనున్నామన్నారు.

ప్యాకేజీ-1లో రూ.421 కోట్లతో.. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు కూడలిలో..

1.ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఇంటికి వెళ్లే రోడ్డు నుంచి కూడలి మీదుగా 'వై' ఆకారంలో అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదన. రోడ్డు నెం.45 నుంచి కేబీఆర్ పార్కు రోడ్డుకు(ఎన్టీఆర్ భవన్ వైపు), మరొకటి నేరుగా యూసఫ్‌గూడ రోడ్డుకు.

2.కేబీఆర్ పార్కు రోడ్డు నుంచి జూబ్లిహిల్స్ రోడ్డు నెం.36కు నాలుగు లైన్ల పైవంతెన

3.యూసఫ్‌గూడ వైపు నుంచి జూబ్లిహిల్స్ రోడ్డు నెం.45వైపు వెళ్లేందుకు రెండు లైన్ల పైవంతెన

కేబీఆర్ పార్కు గేటు జంక్షన్..

1.జూబ్లిహిల్స్ చెక్‌పోస్టు కూడలి నుంచి క్యాన్సర్ ఆస్పత్రి వైపు వెళ్లేందుకు రెండు లైన్ల భూగర్భ మార్గం

2.ఐనాక్స్ మల్టీప్లెక్స్ (ఎల్వీప్రసాద్ ఆస్పత్రి ఎదురుగా) నుంచి జూబ్లిహిల్స్ చెక్‌పోస్టు వైపు 3లైన్ల పైవంతెన

ప్యాకేజీ-2లో రూ.405 కోట్లు.. రోడ్డు నెం.45 కూడలిలో..

1.ఫిల్మ్‌నగర్ కూడలి నుంచి జూబ్లిహిల్స్ చెక్‌పోస్టు వైపు వెళ్లేలా భూగర్భ మార్గం

2.జూబ్లిహిల్స్ చెక్‌పోస్టు నుంచి రోడ్డు నెం.45 వైపు వెళ్లేలా 2 లైన్ల పైవంతెన

ఫిల్మ్‌నగర్ చౌరస్తాలో..

1.అపోలో ఆస్పత్రి రోడ్డు నుంచి జూబ్లిహిల్స్ రోడ్డు నం.45వైపు వెళ్లేలా 2 లైన్ల భూగర్భ మార్గం

2.ఫిల్మ్‌నగర్ కూడలి నుంచి మహారాజ అగ్రసేన్ కూడలి వైపు 2 లైన్ల పైవంతెన

మహారాజ అగ్రసేన్ కూడలిలో..

1.క్యాన్సర్ ఆస్పత్రి నుంచి ఫిల్మ్‌నగర్ వైపు సాగేలా 2 లైన్ల అండర్‌పాస్

2.ఫిల్మ్‌నగర్ కూడలి నుంచి జూబ్లిహిల్స్ రోడ్డు నెం.12వైపునకు 2 లైన్ల పైవంతెన

క్యాన్సర్ ఆస్పత్రి జంక్షన్ వద్ద

1.కేబీఆర్ పార్కు గేటు వైపు నుంచి మహారాజ అగ్రసేన్ కూడలి వైపు వెళ్లేలా 2 లైన్ల అండర్‌పాస్ 2.మహారాజ అగ్రసేన్ కూడలి నుంచి బంజారహిల్స్ రోడ్డు నెం.10వైపు 2 లైన్ల పైవంతెన

# ప్రకృతి వనం.. పల్లెకు బలం



హైదరాబాద్ : గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా పెంచుతున్న పల్లె ప్రకృతి వనాలతో కార్బన్ క్రెడిట్స్ పొందేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ నిర్ణయించింది. వీటితో కార్బన్ ఫైనాన్సింగ్‌ను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈక్రమంలో తెలంగాణ వ్యాప్తంగా ఐదేళ్లుగా పెంచుతున్న మొక్కలు.. చెట్ల ద్వారా వాతావరణంలో వచ్చిన మార్పులు లెక్కించేందుకు నగరానికి చెందిన అయోరా ఎకోలాజికల్ సొల్యూషన్స్‌కు బాధ్యతలు అప్పగించింది. పైలెట్ ప్రాజెక్ట్‌గా రంగారెడ్డి జిల్లాలో సర్వే చేపట్టాలని కేంద్ర గ్రామీణావృద్ధిశాఖ అధికారులు కలెక్టర్ శశాంకకు లేఖ పంపించారు. ఈ మేరకు జిల్లాలోని యాచారం, నందిగామ సహా మరో నాలుగు మండలాల్లో అయోరా సంస్థ ప్రతినిధులు, యాచారంలో సర్వే నిర్వహించారు. మరికొద్ది రోజులు సర్వే కొనసాగనుందని అధికారులు తెలిపారు. మొక్కలు, చెట్ల ద్వారా ఎంతమేర పచ్చదనం పెరిగిందని లెక్కించేందుకు అయోరా సంస్థ కొన్ని ప్రామాణికాలను పాటిస్తోంది. ఐదేళ్లక్రితం నాటిన మొక్కలు ప్రస్తుత దశ, ఆ చెట్టు ద్వారా విడుదలవుతున్న ఆక్సిజన్, ఎత్తు, తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. మూడేళ్లలో రంగారెడ్డి జిల్లాలో 2.3 కోట్ల మొక్కలు నాటారు. వాటిల్లో యాభైశాతం వరకూ చెట్లుగా ఎదిగాయి. వీటిలో ప్రతి చెట్టు వివరాలను అయోరా ప్రతినిధులు రికార్డు చేస్తున్నారు. నాలుగు మండలాల్లోని 12 ప్రాంతాల్లో 68వేల చెట్ల వివరాలను రికార్డు చేశారు.

కార్బన్ ఫైనాన్సింగ్..

పర్యావరణ పరిరక్షణ కోసం క్యోటో దేశంలో ప్రపంచదేశాలు అంగీకరించిన ఒప్పందం అనంతరం కార్బన్ క్రెడిట్స్ వ్యాపారం రూ.కోట్లలోనే కొనసాగుతోంది. కార్బన్ క్రెడిట్స్ బ్యాంకులను నిర్వహించేందుకు ప్రపంచంలో వివిధ కన్సల్టెన్సీలు పనిచేస్తున్నాయి. వర్చువల్ పద్ధతిలో డాలర్లు ఆయా దేశాలకు బదిలీ చేస్తున్నాయి. ఇక తెలంగాణలో సర్వే పూర్తయ్యాక కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ నుంచి పర్యావరణ మంత్రిత్వశాఖ వాటిని తీసుకుని కార్బన్ క్రెడిట్స్‌ను ఇతర దేశాలకు విక్రయించనుంది. కార్బన్ ఫైనాన్సింగ్ పేరుతో కొనసాగే లావాదేవీల ద్వారా వచ్చే లాభాలను ఆయా పంచాయతీలకు తిరిగివ్వనుంది. వీటితో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టే అవకాశాలున్నాయి. రంగారెడ్డి జిల్లాలో సర్వే ఫలితాల ఆధారంగా రాష్ట్రంలో మిగిలిన జిల్లాల్లో చేపట్టనున్నారు.

# విద్యుత్తు సంస్థలో బదిలీల సందడి




మంచిర్యాల : విద్యుత్తు సంస్థ (ఎన్పీడీఏసీఎల్) పరిధిలోని అన్ని విభాగాల బదిలీలకు రంగం సిద్ధమైంది. విధివిధానాలతో కూడిన ఉత్తర్వులు జారీ అయ్యాయి. జూన్ 30 వరకు ఒకేచోట రెండేళ్లు పూర్తిచేసుకున్న వారందరూ(ఇందులో యాభై శాతం) బదిలీకి అర్హులే అని పేర్కొన్నారు. వచ్చే నెల ఏడో తేదీ వరకు ఈ ప్రక్రియ పూర్తికావాలని అందులో పేర్కొంది. కానీ ఈ బదిలీలతో వినియోగదారుల సేవలు మెరుగవడం పక్కనపెడితే ఎలాంటి ప్రయోజనం ఉన్నట్లు కనిపించడం లేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో పాతుకుపోయిన సిబ్బంది, సంఘాల నాయకులు, వారి అనుచరులకు తప్పితే మిగతా వారికి ఉపయోగం అంతంత మాత్రమే అని సంస్థలోని ఉద్యోగుల నుంచే విమర్శలు వస్తున్నాయి. శనివారం సాయంత్రం వరకే బదిలీకి అర్హత ఉన్నవారి వివరాలు ఎస్ఈ కార్యాలయం నుంచి పంపినట్లు సమాచారం.

విధుల చోటు మాత్రమే మారేది..

ప్రస్తుతం సీఎండీ విడుదల చేసిన విధివిధానాలు మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రయోజనం చేకూరేలా కనిపించడం లేదని తెలుస్తోంది. ఓఅండ్ఎం సిబ్బంది నుంచి ఏఈ, ఏడీఈ స్థాయి వరకు ఏ ఒక్కరూ జిల్లా నుంచి కదిలే పరిస్థితి ఈ ఆదేశాలతో లేకుండా పోయింది. జిల్లా వ్యాప్తంగా లైన్‌మెన్, ఆ పైస్థాయి ఉద్యోగులు జిల్లాలో ఎక్కడ విధులు కేటాయించినా చాలా వరకు జిల్లా కేంద్రం నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో వినియోగదారుల సేవల్లో జాప్యం, అంతరాయం ఏర్పడుతోంది. ఈ బదిలీలతోనూ అదే జరగనుంది. విధుల చోటు మారే అవకాశముంది తప్పితే నివాస ప్రాంతం మారేలా లేదు. ఏళ్ల తరబడి ఒకేచోట విధులు నిర్వహిస్తుండటంతో అవినీతితో పాటు ఇతర వ్యాపకాలపై మొగ్గుచూపడం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీరిలో ఎక్కువగా పైరవీకారులు, సంఘాల నాయకులే ఉండటం గమనార్హం. ఇక సంఘాలతో సంబంధం లేని, పైరవీలు చేయలేని మరికొందరు మారుమూల ప్రాంతాలకే పరిమితమవుతున్నారు. జిల్లా కేంద్రానికి వచ్చేందుకు ఎప్పుడో ఒకసారి అవకాశం వస్తుందనే ఆశతో ఏళ్ల కొద్ది జిల్లా సరిహద్దుల్లోనే విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి ఈసారి కూడా నిరాశ ఎదురుకానుంది.

# ప్రణాళికతో చదివితే.. పదిలో విజయం

కరీంనగర్ : పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ జీపీఏను సాధించాలనే లక్ష్యంతో ఇప్పటికే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ప్రత్యేక తరగతులు, ట్యూషన్లు, హోంవర్క్‌లు వంటి వాటితో పుస్తకాల పురుగుల్లా మారుతున్నారు. అయితే కొందరికి పాఠ్యాంశాలపై సరైన ప్రణాళిక, పరీక్షలపై అవగాహన కొరవడటం వంటి వాటితో ఆందోళన చెందుతున్నారు. లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదలతో శ్రమిస్తూ కొంత ఒత్తిడికి గురవుతున్నారు. ఈ పరీక్షలకు దాదాపు 6 నెలల సమయం ఉంది. ఈ క్రమంలో గణితం, సైన్స్ పరీక్షలకు సంబంధించి దృష్టి సారించాల్సిన అంశాలపై విషయ నిపుణులు 'న్యూస్‌టుడే'కు వివరించారు.

సంసిద్ధతతో గణితంలో మంచి మార్కులు

గణితంలో ఉత్తమ జీపీఏ కోసం విద్యార్థులు ఇప్పటినుంచే నిత్యం గంటకుపైగా సమయాన్ని వెచ్చించాలి.

ప్రతి అధ్యాయంలోని కీలక భావనలు, సూత్రాలను రోజూ పునశ్చరణ చేయాలి. ముఖ్య సూత్రాలను ఛార్ట్ రూపంలో తయారుచేసి ఇంట్లో అంటించుకోవాలి.

గత ప్రశ్నపత్రాల్లోని ప్రశ్నలు తిరిగి పునరావృతం కానప్పటికీ.. వాటి మాదిరిగా ఉన్న ప్రశ్నలను ఎక్కువగా సాధన చేయాలి. ఎస్ఈఆర్టీ వారి గణిత అభ్యాస దీపికల నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చే అవకాశమున్నందున వాటిపై దృష్టి పెట్టాలి. 10జీపీఏ సాధన కోసం అన్ని అధ్యాయాలపై పట్టు సాధించాలి.



వ్యాసరూప ప్రశ్నలకు ఎక్కువ మార్కులు ఉన్నందున వాస్తవసంఖ్యలు, బహుపదులు, నిరూపక రేఖాగణితం, సరూప త్రిభుజాలు, త్రికోణమితి, సాంఖ్యాక శాస్త్రం, సంభావ్యత అధ్యాయాలపై పట్టు సాధించాలి.

సమితులు, సాంఖ్యాక శాస్త్రం, సంభావ్యత అధ్యాయాల అంశాలను అభ్యాసం చేయడం ద్వారా సులభంగా ఉత్తీర్ణులు కావచ్చు.

వెన్ చిత్రాలు, వర్గ బహుపది, వృత్తమునకు స్పర్శరేఖలను గీయడం, సరూప త్రిభుజాల నిర్మాణాలు, ఓజీవ్ వక్రములను నిర్మించడాన్ని పలుమార్లు సాధన చేస్తే మంచి మార్కులు సాధ్యం.

సమితులలో సమ్మేళనం, ఛేదనం, పూరకము, భేదం లాంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. పరీక్షల సన్నద్ధత కోసం వీలైనన్ని నమూనా ప్రశ్నపత్రాలను ప్రాక్టీసు చేయడం అలవాటు చేసుకోవాలి.

పార్ట్-బి(అబ్జెక్టివ్) పేపర్‌లోని సమస్యలకు ప్రతి అధ్యాయం నుంచి కీలక అంశాలు, సూత్రాలు ప్రాక్టీసు చేయాలి. పాఠ్యపుస్తకంలోని అన్ని బిట్లు ప్రాక్టీసు చేయడం మరొవద్దు.

జీవశాస్త్రాన్ని పూర్తిగా అర్థం చేసుకుంటేనే..

జీవశాస్త్రంలోని పాఠ్యాంశాలను పూర్తిగా అర్థం చేసుకుంటే ప్రశ్నలకు సమాధానాలు సులభం. కీలక భావనలు, శాస్త్రీయ నామాలు, పటాల ప్రయోగాలను తరచూ సాధన చేస్తూ సొంత మాటల్లో రాసేలా సన్నద్ధం కావాలి.

జీవశాస్త్రంలోని పోషణ, శ్వాసక్రియ, విసర్జక, నియంత్రణ వ్యవస్థ, ప్రత్యుత్పత్తి లాంటి పాఠ్యాంశాలు చదివేటప్పుడు.. ఆ ప్రక్రియ జీవులలో, మొక్కల్లో, మానవునిలో ఎలా ఉంటుందనే దానిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి. వాటిని సొంత మాటల్లో వివరించేలా సాధన చేయాలి.

పర్యావరణం, సహజ వనరులు పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగే అవకాశముంది. పర్యావరణ సమస్యలపై, సహజ వనరుల పొదుపుపై స్వతహాగా అవగాహన ఏర్పరచుకోవాలి.

విభజించి చదివితే భౌతికశాస్త్రం సులభం..

పరీక్షలకు దాదాపు 6 నెలల సమయం ఉండటంతో.. భౌతిక శాస్త్రంలోని 12 అధ్యాయాలను విభజించుకుని చదివితే ఉత్తమ గ్రేడ్ సాధ్యం. విభజించుకునేటప్పుడు దగ్గరి సంబంధం గల పాఠాలను ఎంచుకోవాలి. ఉదాహరణకు మొదటి, 3వ పాఠంలోని భావనలు ఒకే విధంగా ఉంటాయి.

ప్రతి పాఠంలోని ముఖ్యమైన సూత్రాలను నిత్యం సాధన చేయాలి. వాటిని ఒకే దగ్గర రాసి పెట్టుకుని.. సమస్యలను సాధన చేస్తూ ఉండాలి.

కీలకమైన పటాలను తరచూ ప్రాక్టీసు చేస్తూ.. వాటి భావనలను నిజ జీవితంలో అన్వయించుకుంటూ చేయాలి. దీనివల్ల వాటిని విద్యార్థులు మరిచిపోరు.

పుస్తకంలోని టేబుల్స్‌ను శ్రద్ధగా పరిశీలించి వాటిపై ఇప్పటినుంచే పట్టు సాధించాలి. వీటి నుంచే సమాచార నైపుణ్యానికి సంబంధించిన ప్రశ్నలు రానున్నాయి.

కాంతికి సంబంధించిన కిరణచిత్రాలు, ఆవర్తనం, నాభ్యాంతరం కనుగొనే ప్రయోగం, దృష్టి లోపాలకు సంబంధించిన వాటిపై ఎక్కువ దృష్టి పెట్టాలి.: రసాయన శాస్త్రానికి సంబంధించి రోజువారీ జీవితంలో ఆమ్లాలు, లవణాలు, అనువర్తనాలను తెలుసుకునేలా సాధన చేయాలి. ఆధునిక ఆవర్తన పట్టికను పూర్తిగా అర్థం చేసుకోవాలి.

# చెత్త ఆటోలకు జీపీఎస్

హైదరాబాద్: గాడి తప్పిన పారిశుద్ధ్యాన్ని పట్టాలెక్కించేందుకు జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. చెత్త ఆటోలన్నింటికీ జీపీఎస్ పరికరాలు అమర్చింది. ఆటోల కదలికలను జడ్సీలు, డీసీలు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఎప్పటికప్పుడు తెలుసుకునే వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది.

4,400 ఆటోలకు అమరిక

జీహెచ్ఎంసీ 4,500 స్వచ్ఛ ఆటోలను కొనుగోలు చేసి.. వాటిని వ్యర్థాల సేకరణలో ఏళ్ల తరబడి ఉపాధి పొందుతున్న కుటుంబీకులకు ఇచ్చింది. దాదాపు 20శాతం ఆటోలు బాధ్యతను విస్మరించాయి. ఇంటింటి చెత్త సేకరణను గాడిలో పెట్టాలని కమిషనర్ ఆమ్రపాలి యంత్రాంగాన్ని ఆదేశించారు. దీంతో ఐటీ విభాగం అదనపు కమిషనర్ స్నేహశబరీష్, పారిశుద్ధ్య విభాగం అదనపు కమిషనర్ రఘు ప్రసాద్‌లు ఆటోలన్నింటికీ జీపీఎస్ పరికరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు 4,400 ఆటోలకు జీపీఎస్ పెట్టామని, పరికరాలను ఎవరైనా తొలగిస్తే.. ఆటోలను స్వాధీనం చేసుకోవాలని యంత్రాగం హెచ్చరించింది.

# కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపిస్తోంది



ఢిల్లీ: కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠ చూపిస్తోంది అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఆరోపించారు. ప్రజలకు రేవంత్ ప్రభుత్వం చుక్కలు చూపిస్తోందని మండిపడ్డారు. అడ్డగోలుగా హామీలు ఇచ్చి అటకెక్కించారని విమర్శించారు. హిమాచల్ ప్రదేశ్, కర్నాటకలో హామీల పేరిట అవినీతిలో కూరుకుపోయారని అన్నారు. తెలంగాణలో హైడ్రా పేరిట డ్రామా సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. హర్యానాలో కాంగ్రెస్ నేతలు 7 హామీలు అంటున్నారని... ఇక్కడి ప్రజలకు కాంగ్రెస్‌ను నమ్మొద్దు అని చెప్పానని అన్నారు. కాంగ్రెస్ నేతలు ఇప్పటికి ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారని అన్నారు.కొత్త కొత్త డ్రామాలు తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. హిమాచల్, కర్ణాటక, తెలంగాణలో మోసపోయిన ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ అంటే , కుటుంబం, బంధుప్రీతి, మైనార్టీ బుజ్జగింపులు, కులాల మతాల మధ్య చిచ్చుపెట్టే వాటికి కాంగ్రెస్ గుర్తింపు ఇస్తుందని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ నేతలు 6 గ్యారంటీలు అన్నారని. ఒక్కటి నెరవేర్చలేదని మండిపడ్డారు. బీసీ , ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలను ఓట్లకోసం నమ్మించి దగా చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో పూర్తిగా కాంగ్రెస్ ఫ్లాప్ షో అయిందని విమర్శించారు. కౌలు రైతులకు రూ. 15 వేలు భరోసా అన్నారని నెరవేర్చలేదని చెప్పారు. రైతు బంధు పేరిట అన్ని బంధు పెట్టారన్నారు. గృహ నిర్మాణానికి రూ. 5 లక్షలు అన్నారని కానీ అమలు చేయలేదన్నారు.ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మహిళలకు ఎన్నికల్లో ఏడాదికి లక్ష రూపాయలు అన్నారని అవి ఎప్పుడిస్తారో కూడా తెలియడం లేదన్నారు. మొత్తం తెలంగాణ రాష్ట్రం అప్పుల పాలు అయ్యిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి రావడానికే సరిపోతుంది కానీ ప్రజా సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదని ఫైర్ అయ్యారు. జీతాల మందం అప్పులు తెస్తున్నారని అన్నారు. ప్రతి ఏడాది 6 లక్షల మంది విద్యార్థులకు డబ్బులు లోన్ రూపంలో ఇస్తామని చెప్పారని అన్నారు. రైతులకు ఇచ్చింది రూ. 17 వేల కోట్లు మాత్రమేనని చెప్పారు. మంత్రి భట్టి విక్రమార్క మొదటి విడతలో రూ. 15 వేల కోట్లు అన్నారన్నారు. ఎంపీలు పార్లమెంట్‌లో తప్పుడు అంశాలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

పార్టీ అధికారంలోకి వస్తే రాహుల్ గాంధీ చట్టం తీసుకువస్తామని చెప్పారని అలా చేయలేదన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి తెలంగాణ ప్రజలు మోసపోయారన్నారు. రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు చట్టం తీసుకురాలేదని ఎంపీ లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.




హైదరబాద్ లో మరోసారి హైడ్రా హల్ చల్ కొనసాగుతుంది. ఇప్పటికే తెలంగాణ హైకోర్టు.. హైడ్రాకు చివాట్లు పెట్టిన సంగతి తెలిసిందే. అసలు హైడ్రా చట్టబద్ధత ఏంటని, కూల్చివేతలపైన ఎక్కువగా మీ కాన్సెన్ ట్రేషన్ ఎక్కువగా ఉందని కూడా ఘాటు వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అయితే.. మరోసారి హైడ్రా కూల్చివేతలు చేపట్టడానికి రెడీ అయ్యింది. మెయిన్ గా.. చాదర్‌ఘాట్ లోని పలు ప్రాంతాలు, శంకర్ నగర్ బస్తీలో కూల్చివేతలను మంగళవారం అధికారులు ప్రారంభించారు. అక్కడ అనేక ఇళ్లపై...RB- X అని రాసి, ఇళ్ళు ఖాళీ చేసిన వాటిని అధికారులు కూల్చివేస్తున్నట్లు సమాచారం. దీంతో పోలీసులు భారీ ఎత్తున అక్కడికి చేరుకున్నారు. దాదాపు 140 ఇళ్లు ఖాళీ అయ్యాయి. అదే విధంగా ఇళ్లు ఖాళీ చేసిన వారికి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఇందిరమ్మ డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించనున్నట్లు సమాచారం.మరోవైపు మూసీ నది సుందరీకరణ ప్రాజెక్ట్ లో భాగంగా.. తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. మూసీ నదీ పరివాహక ప్రాంతంలో ఎఫ్టీఎల్ పరిధిని సర్వే చేసినట్లు తెలుస్తోంది. దాదాపు 16 వేల నివాసాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు తేలింది. అందులో పేద, మధ్యతరగతి వారు నివసిస్తున్నారు. దీంతో ప్రభుత్వం.. మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ లో భాగంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న పేదలకు ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం ఇప్పటికే జీఓ కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల మూసీ నది పరివాహక ప్రాంతాల్లో అధికారులు పర్యటించి ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే ఇళ్లను గుర్తించి వాటిపైన RB-X అని పెద్ద అక్షరాలతో పెయింట్ వేసిన విషయం తెలిసిందే. కొంతమంది బాధితులు మాత్రం అధికారులపై తిరగబడ్డారు. ఈ నేపథ్యంలో అధికా రులు మాత్రం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇస్తామంటూ కూడా హామీ ఇచ్చారు. ఈక్రమంలోనే.. పోలీసుల భద్రతల మధ్య కూల్చివేతలు ప్రారంభమయ్యాయి. కొంత మంది బాధితులు మాత్రం రోడ్డెక్కి తమ నిరసనలు తెలియజేస్తున్నారు. అంబర్ పేట్ లోని గోల్నాక పరిధిలో.. కూల్చివేతలపై ఇప్పటికే మార్కింగ్ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే తులసి రామ్ నగర్ పరిధిలోని ప్రజలు నిరసలనలకు దిగారు. ఈ కూల్చివేతలపై ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్పందించారు. సీఎం రేవంత్ పై మండిపడ్డారు.

## కేసీఆర్‌నే ఫాలో అవుతున్న సీఎం రేవంత్.. ఎంపీ ధర్మపురి సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, అక్టోబర్ 1: ఇందిరాపార్క్ వద్ద బీజేపీ రైతు దీక్ష కొనసాగుతోంది. బీజేఎల్పీ నేత మహేశ్వర రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ 24 గంటల నిరంతర దీక్షలో ఉన్నారు. వీరి దీక్షకు బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు మద్దతు తెలిపారు. మంగళవారం ఉదయం ఇందిరాపార్క్ వద్దకు చేరుకున్న బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ దీక్షకు మద్దతుతెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితపై హాట్ కామెంట్స్ చేశారు. బీజేపీ దీక్షకు కాంగ్రెస్‌కు భయం పట్టుకుందన్నారు. దీక్షపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించారని... ఆయనకు వయసు మీద పడిందంటూ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ప్రాంతీయ పంటలను విస్మరించారని.. ఇప్పుడు రేవంత్ అదే ఫాలో అవుతున్నారని మండిపడ్డారు. హైడ్రాపై హైకోర్ట్ మొట్టి కాయలు వేసిందన్నారు. "ముస్లింల ఇండ్లను ముట్టుకోలేదు. చుట్టాలను ముట్టుకోలేదు. కాంగ్రెస్ పార్టీ నేతలను ముట్టుకోలేదు. కాంగ్రెస్ టార్గెట్ అంతా హిందువులే" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బెదిరుంచడం , బ్లాక్ మెయిల్ చేయడం రేవంత్ నైజమన్నారు. 22 పంటలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతీయం చేశారన్నారు. గుజరాత్ ఆదాయం మోదీ హయాంలో ఎంత పెరిగిందో తెలుసుకోవాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ ఎస్ పార్టీలకు పైసలు ఎలా సంపాదించాలి అనే ద్యాసనే ఉందంటూ విమర్శలు గుప్పించారు. లిక్కర్ స్కామ్‌లు చేసి జైళ్లల్లోకి వెళ్లారన్నారు. కేసీఆర్ శకం ముగిసిందని.. వచ్చే ఎన్నికల్లో ఉంటాడో పీకుతాడో తెలియదంటూ కామెంట్స్ చేశారు. కేటీఆర్, కవితల మోసం చూసి ఎవ్వరూ కూడా ఓటు వేయరన్నారు. "మొన్నటి వరకు ముసలోడు కేసీఆర్ ఉండే ఇప్పుడు ఆయన వయస్సు 74. ఇక ఇతనితో ఏం కాదు" అంటూ ఎంపీ ధర్మపురి అరవింద్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

**రైతు దీక్ష..** కాగా... రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిర పార్క్ వద్ద 24 గంటలుగా బీజేఎల్పీ నేత మహేశ్వర రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ నిరంతర దీక్ష చేస్తున్నారు. రుణమాఫీ సగంమందికి కూడా పూర్తి చేయలేదని బీజేపీ ఆరోపిస్తోంది. వెంటనే అందరికీ 2 లక్షల రుణమాఫీ చేయాలని కమలం పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. రైతు భరోసా, బోనస్ కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా.. బీజేపీ దీక్షపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా రుణమాఫీ చేశారా అని మంత్రి ప్రశ్నించారు. కేంద్రం రైతుల ఆదాయం రెట్టింపు చేసిందా అని మంత్రి తుమ్మల అడిగారు. మంత్రి తుమ్మల వ్యాఖ్యలకు మహేశ్వర రెడ్డి, ఈటల కౌంటర్ ఇవ్వనున్నారు.

## మూసీ అభివృద్ధిని అడ్డుకుంటే ప్రత్యక్ష ఉద్యమమే..




హైదరాబాద్, అక్టోబర్ 1: అమెరికాలో చదువుకు న్నావు.. అసలు నీకు కామన్ సెన్స్ ఉందా అంటూ మాజీ మంత్రి కేటీఆర్ పై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శివాలెత్తారు. అంతటితో ఆగక.. మూసీ మీద చర్చకు నీ అయ్యను రమ్మను కేటీఆర్ అంటూ సవాల్ విసిరారు మంత్రి. దీనితో మూసీ ప్రక్షాళన వేదికగా.. కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు జోరందుకున్నాయి. హైదరాబాద్ నగరంలోని మూసీ పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణలపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి దృష్టి సారించింది. మూసీ సుందరీకరణకై ప్రక్షాళన చేసేందుకు మూసీ రివర్ ఫ్రంట్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ పక్కా ప్లాన్‌తో ముందుకు వెళ్తోంది. మూసీ పరివాహక ప్రాంతంలో 55 కి.మీ పరిధిలో మొత్తం 40 వేల ఆక్రమణలను అధికారులు గుర్తించారు. తాజాగా వాటి కూల్చివేతలను సైతం ప్రారంభించారు అధికారులు. అయితే మూసీ పరివాహక ప్రాంతంలో గల ఆక్రమణదారులు మాత్రం నిరసనలు తెలుపుతున్న నేపథ్యంలో.. ప్రభుత్వం వారికి డబుల్ బెడ్ రూమ్ గృహాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. అయితే మూసీ ప్రక్షాళన పేరుతో ప్రభుత్వం చేస్తున్న చర్యల పట్ల బీఆర్ఎస్ ముందు నుండి విమర్శలు గుప్పిస్తోంది. అయితే కాంగ్రెస్ కూడా అదే స్థాయిలో ఎదురుదాడికి దిగింది. తాజాగా ఈ వ్యవహారానికి సంబంధించి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కొంచెం ఘాటుగానే బీఆర్ఎస్ పై విమర్శలు చేశారు. అంతేగాక డైరెక్ట్ గా మాజీ సీఎం కేసీఆర్ లక్ష్యంగా సైతం విమర్శలు ఎక్కుపెట్టారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. గతంలో తాను మూసీ ప్రక్షాళన కోసం 11 రోజులు దీక్ష చేసినట్లు, మానవత్వం ఉన్న ప్రతి మనిషి మూసీ ప్రక్షాళనకు మద్దతు ఇస్తారన్నారు. ఇక్కడి ఆక్రమణలు తొలగించేందుకు ప్రజలను ఒప్పిస్తామని, అలాగే ప్రభుత్వం తగిన రీతిలో సాయం చేసేందుకు సిద్దంగా ఉందన్నారు. ప్రతి బాధితుడికి న్యాయం చేస్తామన్నారు. ఇక బీఆర్ఎస్ పార్టీకి మానవత్వం లేదని, అందులో కేసీఆర్, కేటీఆర్ లకు అస్సలు లేదన్నారు.

అమెరికాలో చదువుకున్నావ్.. కేటీఆర్ అసలు నీకు కామన్ సెన్స్ ఉందా అంటూ ఘాటుగా ప్రశ్నించారు. పోరాటాల గడ్డ మా నల్గొండ జిల్లాపై ఎందుకింత కక్ష్య కేటీఆర్ ? అంటూ ప్రశ్నించి.. మా నల్గొండకు వస్తే మూసీ బాధితులను చూపిస్తా అంటూ ఆగ్రహించారు. దమ్ముంటే మూసీ మీద చర్చకు నీ అయ్యను రమ్మను కేటీఆర్ అంటూ మరింత ఘాటుగా విమర్శించారు. ఓ వైపు సీఎం రేవంత్ రెడ్డి అధ్వర్యంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలన సాగిస్తుంటే.. మరో వైపు ఓర్వలేని బీఆర్ఎస్ ప్రజలను పలు విధాలుగా రెచ్చగొడుతుందన్నారు. అయితే ప్రజలు వారి మాటలు నమ్మే పరిస్థితిలో లేదని, ఇప్పటికైనా బుద్ధి మార్చుకోవాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు తాము పాటుపడుతుంటే.. అభివృద్ధిని అడ్డుకొనేందుకు బీఆర్ఎస్ శతవిధాలా ప్రయత్నిస్తుందన్నారు.




థాయ్‌ల్యాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకొంది. పాఠశాల విద్యార్థులు, వారి టీచర్‌ను తీసుకెళుతున్న ఓ బస్సు మంటల్లో చిక్కుకొంది. సెంట్రల్ ఉతాయ్ థాని ప్రావిన్స్ నుంచి తిరిగివస్తుండగా జరిగిన ఈ ఘటనలో మొత్తం 25మంది చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 44 మంది ప్రయాణిస్తున్నారు. థాయ్‌ల్యాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రా మృతులకు సంతాపం తెలిపారు. విద్యార్థులు ట్రిప్‌కు వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకొంది. థాయ్‌ల్యాండ్ రవాణశాఖా మంత్రి ఈ ప్రమాదం వివరాలను వెల్లడించింది. "మొత్తం 44 మంది బస్సులో ప్రయాణిస్తున్నట్లు తెలిసింది. వీరిలో 38 మంది విద్యార్థులు, ఆరుగురు టీచర్లు ఉన్నారు. ఇప్పటివరకు 16 మంది విద్యార్థులు, ముగ్గురు టీచర్లను రక్షించారు. మిగిలిన వారి విషయంపై ఇంకా స్పష్టత లేదు" అని పేర్కొన్నారు. ఇటీరియర్ మంత్రి అనుతిన్ చర్నవిరకుల్ మాట్లాడుతూ మృతుల సంఖ్యను ఇంకా ధ్రువీకరించలేమని పేర్కొన్నారు. ఘటనా స్థలంలో దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదన్నారు. ప్రమాదం నుంచి బయటపడిన వారి సంఖ్య ఆధారంగా.. 25 మంది చనిపోయి ఉండొచ్చన్నారు.

ప్రమాదం జరిగి గంటలు గడుస్తున్నా.. మృతదేహాలు ఇంకా బస్సులోనే ఉండిపోవడం గమనార్హం. ఈ ప్రమాదంపై ఆన్‌లైన్‌లో పోస్టు అయిన వీడియోల్లో బస్సు నుంచి నల్లటి పొగ, భారీగా మంటలు ఎగసిపడుతున్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల వయస్సు ఇతర వివరాలు వెల్లడికావాల్సి ఉంది. ఒక టైరు పేలిపోయినట్లు కొందరు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. సహాయక చర్యల్లో పాల్గొన్న ఓ సంస్థ తాము 10కిపైగా మృతదేహాలను చూసినట్లు ఫేస్‌బుక్‌లో పేర్కొంది.

## లక్షలాది మందికి రేవంత్ నిద్రలేకుండాచేస్తున్నారు: కేటీఆర్

హైదరాబాద్: పేదలకు ఇబ్బందులు రాకూడదనే గతంలో మూసీకి సంబంధించిన ప్రాజెక్టులను నిలిపివేశామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ప్రస్తుతం మూసీ సుందరీకరణ ప్రాజెక్టుతో సుమారు 2లక్షల మందిని రోడ్డున పడేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

హైదరాబాద్‌లోని అంబర్‌పేట పరిధిలో మూసీ పరివాహక ప్రాంతాల్లో పార్టీ నేతలతో కలిసి ఆయన పర్యటించారు. పలువురు బాధితులను పరామర్శించి వారితో మాట్లాడారు. హైదరాబాద్‌లో భారాసకు ఓట్లు వేసిన వారిపై సీఎం రేవంత్‌రెడ్డి పగబట్టారని.. లక్షలాది మందికి నిద్రలేకుండా చేస్తున్నారని విమర్శించారు. ఎప్పుడు ఇళ్లు కూల్చుతారోనని ప్రజలు ఆవేదనతో ఉన్నారని చెప్పారు. ఇళ్ల వద్దకు బుల్డోజర్లు వస్తే కంచెలు పెట్టాలన్నారు. రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి కూడబలుక్కున్నారా?అని ప్రశ్నించారు. పేదల ఇళ్లు కూల్చుతుంటే ఈ ప్రాంత ఎంపీ ఎక్కడికి వెళ్లారని పరోక్షంగా కిషన్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో సగం డబ్బుతో మూసీ ప్రక్షాళన చేపట్టారన్నారు. బాధితులకు భారాస అండగా ఉంటుందని చెప్పారు.



**కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు :** అంబర్‌పేటలో కేటీఆర్ కాన్వాయ్‌ను యూత్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకున్నారు. మంత్రి కొండా సురేఖకు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనకారులను పోలీసులు చెదరగొట్టారు.

## ప్రజలను ఏడిపించి .. సంతోషించే వాడు శాడిస్ట్ అవుతాడు.. రేవంత్‌పై ఈటెల ఫైర్



హైదరాబాద్, అక్టోబర్ 1: నగరంలోని ఇందిరాపార్క్ వద్ద 24 గంటలుగా బీజేఎల్పీ నేత మహేశ్వర రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ నిరంతర దీక్ష చేస్తున్నారు. ఈ సందర్భంగా మాల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల మాట్లాడుతూ.. "మాట వినని వాడు సైకో అవుతాడు.. ప్రజలను ఏడిపించి .. సంతోషించే వాడు శాడిస్ట్ అవుతాడు" అంటూ ఎంపీ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ తాట తీసే శక్తి ప్రజలకు, రైతులకు ఉంటుందన్నారు. ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదని హెచ్చరించారు. "మీ అంతరాత్మ సాక్షిగా ఏది అనిపిస్తే అది చెప్పండి. సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన చిలుక పలుకులు మాట్లాడితే మీ గౌరవం పోతుంది" మంత్రి తుమ్మలను ఉద్దేశించి హితవుపలికారు. ప్రభుత్వం ఇస్తా అన్న 2 లక్షల రూపాయలు రైతుల అకౌంట్‌లో వేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తరహాలోనే ఈ ప్రభుత్వాన్ని ప్రజలు బొందపెడతారన్నారు. రెండు మూడు రోజుల్లో రింగ్ రోడ్డు వద్ద ధర్నా చేస్తామన్నారు. సాక్షాత్తు హైకోర్టు హైడ్రాపై మొట్టికాయలు వేసిందని.. అవి వేసింది హైడ్రాపై కాదు నేరుగా సీఎం రేవంత్ రెడ్డికి వేసిందంటూ వ్యాఖ్యలు చేశారు. "కోర్టు వ్యాఖ్యలతో అయినా రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న. ప్రజలు నీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం ఖాయం" అంటూ ఎంపీ ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

## ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డికి ఎస్కార్ట్ కేటాయింపు..

### – ఈనెల 4న శాసనమండలి విప్‌గా బాధ్యతలు!

తాండూరు(వికారాబాద్): పార్లమెంటు ఎన్నికలకు ముందుగానే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి శాసనమండలి చీఫ్ విప్‌గా బాధ్యతలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. అప్పటి నుంచి మహేందర్‌రెడ్డి విప్‌గా బాధ్యతలు చేపట్టలేదు. అయితే బుధవారం పితృపక్షం అమావాస్య ముగియనుండడంతో ఈనెల 4న విప్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, శాసన మండలి స్పీకర్‌కు సమాచారం ఇవ్వడంతో మహేందర్ రెడ్డికి పైలెట్, ఎస్కార్ట్ వాహనాలను కేటాయించారు. వీటితో పాటు 8మంది ఎస్కార్ట్ సిబ్బందిని కూడా కేటాయించారు. కేటాయించిన వాహనాలు పాతవిగా ఉండడంతో వాటి స్థానంలో కొత్త వాటిని కేటాయించాలని ఎమ్మెల్సీ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి లేఖను కూడా పంపారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత మహేందర్‌రెడ్డిని ప్రోటోకాల్ పరిధిలోకి తీసుకు వచ్చి రంగారెడ్డి లేదా వికారాబాద్(%ఎఱఅఝుతీఝుఝఁ%) జిల్లా బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. ఇటీవల తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం రోజు మహేందర్‌రెడ్డికి మేడ్చల్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి అక్కడ జాతీయ జెండాను ఎగురవేసే అవకాశం కల్పించింది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660